ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 20.09.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. నల్లగొండ జిల్లాలో నిలిచిపోయిన SLBC సొరంగమార్గం ప్రాజెక్టు పనులను రెండేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించాలని పలువురు మంత్రులు అధికారులను ఆదేశించారు.
2. పౌరుల కేంద్రీకృతం గా రూపుదిద్దుకున్న కొత్త నేర చట్టాలను ఆకళింపు చేసుకుని , సాంకేతిక సామర్ధ్యాన్ని పెంపొందించుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ కోరారు.
3. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి ఈ సాయంత్రం సమావేశమై పలు అంశాలపై చర్చించనుంది.
4. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు ఈ రోజు హైదరాబాద్ లో పర్యటిస్తూ పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

**ఎస్ ఎల్ బీసీ-మంత్రులు:**

నల్లగొండ జిల్లాకు శాశ్వతంగా సాగు , తాగు నీరందించే SLBC సొరంగ మార్గం ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, పదేళ్లలో పది కిలోమీటర్లు కూడా పూర్తి చేయలేకపోయిందని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. SLBC సొరంగం ప్రాజెక్టు పనులను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , కోమటిరెడ్డి లతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ రోజు సందర్శించారు. నిర్మాణంలో ఉన్న సొరంగంలోకి వెళ్లిన మంత్రులు అక్కడి పనులను పరిశీలించారు. పనులు నిలిచి పోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వెంటనే చేపట్టి రెండేళ్లలో పూర్తి చేసేలా ప్రాణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా పనులు ఆలస్యం కావడం వల్ల బడ్జెట్ విపరీతంగా పెరిగి

పోయిందని అన్నారు.. అనంతరం జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాగు, తాగు నీటి ప్రాజెక్టులపై మంత్రులు సమీక్ష నిర్వహిస్తున్నారు.

(పిటిసి, నల్లగొండ జిల్లా)

-------------------------

**SVP NPA:**

పౌరుల కేంద్రీకృతంగా రూపుదిద్దుకున్న కొత్త నేర చట్టాలను ఆకాళింపు చేసుకుని , ఎప్పటికప్పుడు తలెత్తే సవాళ్ళను అధిగమించే సాంకేతిక సామర్ధ్యాన్ని పెంపొందించుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ IPS ప్రొబేషనర్లకు ఉద్బోదించారు. ఈ రోజు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో 76 వ RR బ్యాచ్ దీక్షాంత్ పెరేడ్ సమీక్షించిన అనంతరం ప్రొబేషనర్లను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. సైబర్ నేరాలు ప్రపంచానికి అతి పెద్ద సవాలుగా మారుతున్నాయని , ఈ సవాళ్ళను అధిగమించేందుకు తగిన సాంకేతిక శక్తి యుక్తులను పెంచుకోవాలని సూచించారు. నేర దర్యాప్తులో సమగ్ర శోధన అవసరమని చెబుతూ , నేరస్తులను పట్టుకోవటంతో పాటూ నేరాల మూలాలను గుర్తించి నాశనం చేయాలని పేర్కొన్నారు. తీవ్రవాదం , వామపక్ష ప్రేరిత హింస లాంటివి దేశంలో దాదాపు తగ్గిపోయాయనీ , మిగిలిన ఏ కొంతనైనా నిర్మూలించేలా వ్యవహరించాలని సూచించారు. అంతకు ముందు బేసిక్ కోర్స్ రిపోర్టును NPA డైరెక్టర్ అమిత్ గార్గ్ సమర్పించారు. బేసిక్ కోర్స్ శిక్షణ పూర్తి చేసుకున్న IPS ప్రొబేషనర్ల చేత తమ బాధ్యతలు, విధులకు సంబంధించి జాతీయ పతాకం సమక్షంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జరిగిన పెరేడ్ కు అచ్యుత్ అశోక్ నేతృత్వం వహించారు. 188 మంది IPS అధికారులు, 19 మంది భూటాన్, మాల్దీవ్స్ లాంటి విదేశాలకు చెందిన ప్రొబేషనర్లు బేసిక్ కోర్స్ శిక్షణ ముగించుకున్నారు. వీరిలో 58 మంది మహిళలు ఉన్నారు. కాగా వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన ప్రొబేషనర్లకు ఈ సందర్భంగా మంత్రి నిత్యానందరాయ్ పురస్కారాలు అందజేశారు.

(MSL)

-------------------------------

**మంత్రి మండలి:**

రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈరోజు సాయంత్రం జరుగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అనేక అంశాలపై మంత్రి మండలి చర్చించి పలు నిర్ణయాలు తీసుకోనుంది. హైడ్రా కు చట్టబద్ధతకు కల్పించడం, ధరణి కమిటీ చేసిన 54 సిఫారసులపై చర్చించి, వాటి అమలుపై మంత్రి మండలి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో బీసీ కులగణన , విశ్వవిద్యాలయాలకు కొత్త పేరు పెట్టడం తదితర అంశాలపై కూడా ముఖ్యమంత్రి, మంత్రులు ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

(డెస్క్)

--------------------------------------

**రైతు భరోసా-కేటీఆర్**

రైతు భరోసాపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఢిల్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రైతాంగాన్ని అయోమయానికి గురిచేస్తున్నాయని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు అన్నారు. కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వలేమని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను నమ్మించి మోసం చేసినట్టే అవుతుందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికే రుణమాఫీ పేరిట మోసం చేసిందని , వర్షాకాలం పెట్టుబడి సాయం ఎగ్గొట్టిందని అన్నారు. ఇప్పుడు కౌలు రైతుకు భరోసా ఇవ్వలేమని చేతులెత్తేస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పినదేమిటి.. చేస్తున్నదేంటని ప్రశ్నించారు.

(డెస్క్)

-----------------------------------------

**ఐ అండ్ బీ కార్యదర్శి-హైదరాబాద్ టూర్:**

కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు ఈ రోజు హైదరాబాద్ లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా సంజయ్ జాజు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో డీపీసీ సమావేశంలో పాల్గొన్నారు. నగరంలోని ఓ హోటల్ లో సినీ సంఘాలు, నిర్మాణ సంస్థలు, ఏవీజీసీ ఇండస్ట్రీ ప్రతినిధులతో

సమావేశం అయ్యారు.  ఈ సాయంత్రం దివంగత నటులు అక్కినేని నాగేశ్వరరావు జయంతి కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణం అవుతారు.

(డెస్క్)

------------------------------------

**స్వచ్ఛత హీ సేవా  - GHMC డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో    ప్రతి ఒక్కరూ పాల్గొనాలని GHMC  డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలు అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.   GHMC  ఆధ్వర్యంలో  10  రోజుల పాటు స్వచ్చత హి సేవా కార్యక్రమలు చేపడుతున్నామని ఆకాశవాణికి చెప్పారు.

(బైట్ GHMC డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి)

(HYD - PTC)

-------------------------------------------

**సంపూర్ణత అభియాస్-నారాయణ పేట జిల్లా:**

కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా నారాయణపేట జిల్లాలో విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను , ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తున్నామని జిల్లా విద్యా శాఖ అధికారి మొహమ్మద్ అబ్దుల్ ఘని ఆకాశవాణి కి  తెలిపారు.

(సౌండ్ బైట్ : మహమ్మద్ అబ్దుల్ ఘని,జిల్లా విద్యా శాఖ అధికారి,నారాయణపేట)

(వనపర్తి జిల్లా, పిటిసి)

----------------------------------------------

**Swach Hi Seva –సూర్యాపేట:**

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సూర్యాపేట జిల్లా బరాకత గూడెంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్తుల చేత స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మునగాల అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శైలజ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబర్ రెండు వరకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

(పిటిసి సూర్యాపేట)

----------------------------------

**కరీంనగర్ - స్వచ్ఛ త హి సేవా:**

గ్రామాలను శుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఈ రోజు కరీంనగర్ జిల్లా మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం పలువురు పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య కార్డులు , బీమా పత్రాలు, విధుల నిర్వహణకు అవసరమైన రక్షణ సామగ్రి అందజేశారు. సఫాయి మిత్ర సురక్ష కింద కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

(పీటీసీ, కరీంనగర్)

------------------------------------

**నల్లగొండ –స్వచ్చత హి సేవ:**

భారత ఆహార సంస్థ , నల్గొండ జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో ఉద్యోగులు ఈ రోజు స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ AGM డాక్టర్ రాఘవేంద్ర సింగ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలల స్వప్నమైన వికసిత భారత సాధనకు స్వచ్ఛ భారతమే ముఖ్య సోపానమని అభిప్రాయపడ్డారు.

(పిటిసి, నల్లగొండ జిల్లా)

------------------------------

**ఆసిఫాబాద్ – ఆదర్శ పాఠశాల:**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ , టీజీటీ పోస్టుల కోసం గంటల ప్రాతిపదికన బోధించడానికి ఆసక్తి అర్హత గల వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ దుర్గం మహేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ , బీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత కలిగిన వారు ఈనెల 21వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. PTC

**భద్రాద్రి-కలెక్టర్:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రాధాన్యతా రంగాలను పరిగణలోకి తీసుకొని రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. వివిధ బ్యాంకులకు చెందిన అధికారులతో , జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పథకంలో బ్యాంకు ఖాతాలు ప్రారంభించడానికి అన్ని బ్యాంకులకు లక్ష్యాలు కేటాయించాలని సూచించారు. ఐ టి డి ఏ ద్వారా పెండింగ్ లో ఉన్న యూనిట్ల మంజూరుకు చర్యలు చేపట్టాలని , మత్స్యకారులకు కూడా రుణాలు వెంటనే మంజూరు చేయాలని బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు.

(పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం)